

# భూమిపుత్రులు

గంటా రమాదేవి

అనసూయక్కయ్య ఉత్తరం వ్రాసింది—తమ్ముడూ, ఉన్నపళాన రా, మీ బావ పరిస్థితి ఏం బాగోలేదు అని సారాంశం. వారం రోజులు సెలవు పెట్టి, ఆదరా బాదరా సంచిలో నాలుగు గుడ్డలు కుక్కుకుని రైలు స్టేషనుకు బయలుదేరాను. రైలు నడుస్తున్నంత సేపూ ఒకటే ఆలోచన. బావగారికి ఏమైంది? అనారోగ్యమా? ఆయ నెప్పుడు ఖాయిలా పడలేదే! ఏమై ఉంటుంది?

రైలు దిగేసరికి చీకటి పడుతోంది. రిక్షా ఎక్కి అక్కయ్య ఇంటికి వెళ్ళాను. పిల్లలిద్దరూ పరుగెత్తుకుంటూ వచ్చారు సంబరంగా. స్టేషనులో కొన్న అరటిపళ్ళు, బిస్కెట్లు వాళ్ళ చేతుల్లో పెట్టాను. అవి తీసుకుని ఎగురుకుంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

అక్కయ్య ముఖంలో విషాదం స్పష్టంగా కనిపిస్తోంది. నన్ను చూడగానే కళ్ళు తుడుచుకుంది. నా కళ్ళు బావగారి కోసం వెతికాయి. ఆయన అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండాలి!...ఆయన జాడ తెలియలేదు. బహుశా ఆసుపత్రిలో జాయిన్ చేశారా? ఏమిటి జబ్బు? ఎలా ఉంది పరిస్థితి?

"అక్కా! బావగారేరీ?" అన్నాను. నా కంఠంలో ఆత్రత కొట్టవచ్చినట్లు కనపడుతోంది.


"పొలాల్లోకి వెళ్ళారు" అంది అక్కయ్య. కాఫీ కాచి తీసుకు వచ్చింది. అది తాగుతూ అడిగాను.


"నీ ఉత్తరం ఉదయం అందింది. పన్నెండు గంటల రైలులో బయలుదేరి వచ్చాను... ...బావగారి పరిస్థితి. అంటే ఆయన ఆరోగ్యం గురించి...మనసు రకరకాలుగా ఆలోచించింది."

"ఆయనకేం! ఆయన మహారాజులా ఉన్నారు. నా రోజే బాగులేదు. అంతా నా కర్మ..." గద్గద కంఠంతో అంది అక్కయ్య.

"ఏం జరిగింది?" అనడిగాను.

"ఏం చెప్పమంటావు? నలభయ్యోపడిలో పడ్డారా? ఈ వయసులో హవ్వ...ఇద్దరు పిల్లలున్నారన్న జ్ఞానమైనా—లేకుండా నాకన్న చిన్నవాడివి. నీకు ఇలా చెప్పుకోవడం... అంతా నా తలరాత...కళ్ళు తుడుచుకుంటూ అంది అక్కయ్య!





"నువ్వు అడగలేదా?"

"అదీ అయింది!"

"మరి?"

"ఆయన సంగతి నీకు తెలుసుగా? ఒక వెర్రి నవ్వు...సమాధానం అంతే. మనం ఎంత పీనుక్కుచచ్చినా ఆయన నోటివెంట మాటే రాదు..."

"బావ అలాటి వాడు కాదక్కయ్య! నీ అనుమానం వట్టిదేనేమో?"

కోపంగా చూసింది అక్కయ్య నాకేసి.

"అంటే నే బుద్ధిలేని దాన్ననేగా? నెలరోజులు

గా చూస్తున్నాను భాగోతం. రోజు రాత్రిపూట వెళుతూ ఉంటారు. మళ్ళీ తెల్లారేకే రావడం. మనిషి నలిగిపోయి, నిద్రలేని కళ్ళతో ఇంటికి రావడం."

"అంతమాత్రానికే?"

కాఫీ కప్పు కింద పెడుతూ అన్నాను.

"అది కాదురా. మొదట్లో ఏవో టిఫిన్లు చేయమని చెప్పేవారు. చేసేదాన్ని. తెల్లారేక అవి తిరిగొచ్చేవి. బహుశా 'దానికి' నచ్చలేదేమో! మానేశారు. "అదే" వండి పెడుతోందేమో!"

"తరవాత?"

"పాలు, పంచదార, టీ పొడుం పట్టుకెళ్ళేవారు. పిక్నిక్ పట్టుకెళ్ళినట్టు...అప్పుడే నా అనుమానం బలపడింది. అదెవత్తో గాని ఈయన్ను బాగా వలలో వేసుకుంది..."

"పొలాల్లో పనులు చేయిస్తూ పని వాళ్ళకీ, తనకీ నిద్రరాకుండా ఉండాలని టీపొడి, పాలు పట్టుకెళ్ళేవారేమో!"

"నా శ్రాద్ధం! అదేంకాదు. పొలాల్లో కోతలు అయిపోయాయి. ఇప్పుడు. పనులేం లేవు..." నేను ఆలోచనలో పడ్డాను. బావ చిత్రమైన మనిషి. సైన్సులో పోస్టు గ్రాడ్యుయేట్. కొన్నాళ్ళు ఢిల్లీలో ఐ. సి. ఏ. ఆర్. (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీ సెర్చ్)లో పని చేశాడు. ఉద్యోగం నచ్చక రాజీనామా చేశాడు. ప్రైవేటు కంపెనీ రీ సెర్చర్‌గా చేరి సంవత్సరం పాటు పనిచేసి అదీ వదిలేశాడు. 'సైన్సు టీచింగ్ స్కూలు' అని స్కూలు నడిపాడు రెండేళ్ళు. ఎందుకో అదీ వదిలేశాడు. సొంత ఊరొచ్చి వ్యవసాయం చేయిస్తున్నాడు. అక్కయ్య పెద్దగా చదువుకోలేదు. ఆమె ఆలోచనలు, సగటు తెలుగు ఆడపడుచు ఆలోచనల్లా ఉండడంతో ఆశ్చర్యం లేదు.

"అక్కా! బావ చిత్రమైన మనిషి..."

"అందుకేరా నా భయం! అసలు ఆ తరవాత జరిగిన సంగతులే నా అనుమానం బలపడేట్టు చేశాయి. నాలు గయిదు రకాల సెంట్లు, సువాసన సబ్బులు, మల్లెపూలు, గులాబిపూలు. ఇలాటివి పట్టుకెళ్ళడం మొదలెట్టారు...మొన్న ఏం జరిగిందో తెలుసా ?...రాత్రంతా తిరిగొస్తున్నారు కదా అని మరోసారి 'ఏమైనా కావాలా! అనడుగుదామని ఆయన గదిలోకి ప్రవేశించారు. తల వంచి ఏదో రాసుకుంటున్నారు. నేనూ అంతో ఇంతో చదువుకున్నాను కదా! నన్ను చూసి ఆయన రాస్తున్నది ఆపేశారు. చిరాగ్గా చూసి అన్నారు.

"అనూ! నేను పనిలో ఉన్నప్పుడు నా గదిలోకి రాకు."

ఆ మాటలకు నా మనసు చివుక్కుమంది. వచ్చేస్తూ ఉంటే ఆయన రాస్తున్న కాగితం చూశాను. "సెక్రెట్స్ ఆఫ్...ఫామిలీ" అని ఉంది. ఫామిలీ అంటే సంసారమనేగా అర్థం. నా సంసారానికి ఏదో ముప్పు వస్తుంది దేముడా అని నీకు ఉత్తరం రాశాను."

** ** **

రాత్రి ఏడు గంటలకు బావ గారొచ్చారు. నన్ను చూసి పలకరింపుగా నవ్వారు. ఆయన తత్వం నాకు తెలుసు. నేనూ ఎక్కువ మాట్లాడించలేదు. ఆయన ముఖం నిర్మలంగా ఉంది. మోసం చేసే మనిషిలా నా కనిపించలేదు. కణతల దగ్గర నెరుస్తున్న జుట్టు, నుదుటిపై లీలగా గీతలు, కంటి చుట్టూ నల్లటి వలయాలు. ఆయన మానసికంగా తీవ్ర మథనానికి గురవుతున్నారని నాకు అనిపించింది. ఆయన చేసే ప్రతి కదలిక జాగ్రత్తగా గమనిస్తున్నాను. మౌనంగా భోజనాలు పూర్తి చేశాం. ఆయన తన గదికెళ్ళి తలుపులు బంధించుకున్నారు. ఆయనటు వెళ్ళగానే అక్కయ్య అంది.

"ఇదీ వరస. ఇప్పటి నుంచి రాత్రి పదివరకు తలుపు తెరవరు. తరవాత టార్చిలైటు తీసుకుని, చేతిలో సూటుకేసుతో బయటకు వెళ్ళిపోతారు. మళ్ళీ రావడం ఉదయాన్నే!"

డాబా మీద పక్కేసింది అక్కయ్య. చల్లటి గాలికి మాగన్నుగా నిద్రపడుతోంది. "ఒరే! తమ్ముడూ, లేరా, మొద్దు నిద్రా నువ్వూనూ!" అని కుదిపి లేపింది అక్కయ్య. ఉలిక్కిపడి లేచాను.

"ఆయన వెడుతున్నారు!" అంది.

బావగారి మీద కోపం వచ్చింది. వెధవ పని చేసేవాడు, ఇంట్లో చుట్టం ఉన్నాడంటే భయపడతాడు. ఈయనేమిటి? నేనేం కుర్రాడనుకుంటున్నాడా? నే నున్నానని భయం కూడా లేకుండా అదెవత్తో దాని దగ్గరకు ఈ రాత్రిమాటూ లుగా వెడుతున్నాడంటే ఎంత తెగింపు?

గబగబా పైజామాతొడుక్కుని, టార్చి తీసుకుని బయటకు పరుగెత్తాను. ఫర్లాంగు దూరంలో కదులుతున్న నీడ కనిపించింది. మసక బారుతున్న వెన్నెలలో. ఆయన్నే అనుసరిస్తూ నడుస్తున్నాను.

పంట పొలాలు శిథిల సామ్రాజ్యాల్లా బోసిగా ఉన్నాయి. మసక వెలుతురులో ఎండిన భూములు. నిద్రపోతున్న రాకాసుల్లా నల్లటి కొండలు. భయంకరంగా ఉన్నాయి.

ఊరుదాటి వచ్చేశాం. పంటపొలాలు దాటి మెట్టభూములు, రాయి రప్పా నిండిన ప్రదేశం దాటేశాం. గమ్యం తెలిసిన ఆయన ముందు. నేను వెనకాల. కృత నిశ్చయం ఆయనది. భయం, బెరకు, అనిశ్చితత నావి.

మబ్బుల వెనక నుంచి చంద్రుడు బయటపడ్డాడు. ఫోకసు చేసిన సెర్చ్‌లైట్‌లా వెలుగుతున్నాడు. ఆ వెలుగులో ఆ దృశ్యం చూసి అదిరిపడ్డాను.

బట్టలన్నీ ఒక్కొక్కటీ విప్పేశాడు. ఒక రాతి మీద పెట్టాడు. చేతిలో సూటుకేసు కింద పెట్టి ముందుకు వంగాడు. చేతుల మీదా, కాళ్ళ మీదా బరువు ఆనించి జంతువులా గెంతుతూ నాలు గయిదు చుట్లు ఆ సూటుకేసు చుట్టూ తిరిగాడు.

నాకు తెలిసిన మనిషేనా ఈయన? ఏమిటీ చేష్టలు? స్థాణువులా నిలబడి గుడ్లప్పగించి జరుగుతున్న దాన్ని సంభ్రమంతో చూస్తున్నాను.

తరవాత ఆయన లేచి నిలబడ్డాడు. సూట్‌కేసుకు బెల్టు లాటిది కట్టాడు. మెడలో వేసుకున్నాడు. జంతువులా గెంతుతూ అడవిలోకి వెళ్ళిపోయాడు.

** ** **

భయంతో బిగిసిపోయిన నాకు ముందుకు వెళ్ళడానికి ధైర్యం చాలలేదు. దయ్యం పట్టిన వాడిలా ఇంటివైపు పరుగెత్తాను. వేసి ఉన్న తలుపుల వెనుక అక్కయ్య మేలుకుని ఉంటుందని నాకు తెలుసు.

నన్ను నేను సంబాళించుకున్నాను. అయిదు నిమిషాలు పట్టింది తేరుకోవడానికి. తలుపుకొట్టాను. వెంటనే తెరుచుకున్నాయి తలుపులు.

"తెలిసిందా అదెవత్తో?" ఆత్రతగా అడుగింది అక్కయ్య!"

"లేదు. నన్ను బురిడీ కొట్టించాడు." అతికష్టం మీద అబద్ధం చెప్పాను.

"నే చెప్పలే? ఆయన ఎంతకయినా తగును."

** ** **

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. నగ్నంగా ఆయన ఆగంతులేమిటీ? జంతువులా పరుగెత్తుతూ అడవిలో ఎక్కడికెళ్ళాడు?

తెల్లవారి లేస్తూనే కాలకృత్యాలు తీర్చుకుని బయలుదేరాను. అడవి లోపలికెళ్ళి చూడాలని నిర్ణయించుకున్నాను.


పగటి కాంతికీ, రాత్రి కాంతికి ఎంత తేడా? రాత్రి చూసిన దృశ్యమే పగలు మరోరకంగా కనపడుతోంది.


ఎండిన పంట పొలాల్లో అక్కడక్కడా పచ్చని మొలకలు. మెట్టపొలాలు, రాతిబాట దాటి అడవిలో ప్రవేశించాను. రాత్రి నే చూసిన రాయి అలాగే ఉంది. ప్రతీ చెట్టూ, పుట్టా పరీక్షిస్తూ ముందుకెళ్ళాను. సూర్యకాంతి నిట్ట నిలువుగా పడుతోంది అడవిలో. పొదలు కదిలి చిరు జంతువులు పారిపోతున్నాయి. నా అడుగుల సవ్వడి విని కుందేళ్ళు, అడవికోళ్ళు. చెట్లమీద పక్షులు గోలగా నా రాకను అందరికీ చెబుతున్నాయి. ఎక్కడో చెట్టు కొడుతున్న శబ్దం. నలిగిన బాట వెంబడే తిరుగుతూ ప్రతీచోటా పరీక్షించాను. మనుష్య సంచారం లేదు. నివాస స్థలాలు లేవు.

తిరిగి, తిరిగి ఒక చెట్టు కిందకి చేరాను. బావ విచిత్ర వ్యక్తి! అక్కయ్య అనుమానం నిజం కాదు. రాత్రిపూట ఆయన అడవిలో కెందుకు వస్తున్నాడు? మధ్యాహ్నం రెండు గంటలవుతూండగా ఇంటికొచ్చాను.

"అన్నం చల్లారిపోయింది. ఎక్కడికెళ్ళావ్?"

"పనిమీద "





అంటే వాటికి ప్రీతి. వాటితో నాకు స్నేహం ఏర్పడింది. వాటి భాష కూడా కొంత అర్థం చేసుకున్నాను—ఫొనెటిక్స్ శాస్త్రం ఆధారంగా. ఎస్ట్రానమీలో మనకు తెలిసిన సూర్యకుటుంబం చాలా చిన్నది. వాటిలో మన భూగ్రహం ఏ పాటిది? సూర్యభగవానుడు బ్రహ్మాండమైన నక్షత్రం.

మన భూమికి 1300 రెట్లున్న జూపిటర్ గ్రహం సూర్యుడితో పోలిస్తే ఒక నలక లాటిది. నిజానికి గ్రహాల ద్రవ్యరాశినంతా కలిపితే సూర్యుడిలో 13 శాతం కన్నా ఎక్కువ ఉండదు. సూర్యుడి చుట్టూ అతి వేగంగా తిరిగేది మెర్క్యూరీ గ్రహం.

సూర్యుడికి మూడున్నర కోట్ల మైళ్ళ దూరంలో ఉండి క్షణానికి ముప్పైమైళ్ళ వేగంతో తిరుగుతూ దాదాపు మూడునెలల్లో ఒక చుట్టు పూర్తి చేస్తుంది. తొమ్మిదికోట్ల ముప్పైలక్షల మైళ్ళ దూరంలో ఉన్న భూమికి ఒక చుట్టు పూర్తవడానికి సంవత్సరం పడుతుంది.

"జూపిటర్, మెర్క్యూరీ ఇతర గ్రహాలలో లోహాలకు కలిగే అతివేడి కాని, రాళ్ళు గడ్డకట్టే అతిశీతలం గాని ఉన్నాయి. భూమికి తప్ప మరే గ్రహానికి వాతావరణమనే రక్షకకవచం లేదు. మరి ఈ ఇతర గ్రహవాసులు ఎక్కడ నుంచి వచ్చాయి? వేరే సూర్యకుటుంబం నుంచా? అనూహ్యమైన దూరంలో ఉన్న మరెన్నో సూర్యకుటుంబాలు, భూములున్న మాట నిజమే. కాని అంతదూరం నుంచి ఎవరు రాగలరు? నా ప్రశ్నకు సమాధానం దొరుకుతున్న సమయంలో—ప్—నువ్వు వచ్చేవ్. కొన్ని విషయాలు మాత్రం తెలిశాయి. రుజువులు లేనందువల్ల అవి అభూత కల్పనలుగా అనిపిస్తాయి. ఇంకొక వారంలో ఆ రుజువులు సంపాదించి ఉండే వాడిని."

ఖిన్నుడైన బావ ముఖం చూసి నాకు జాలి వేసింది. మానవజాతికి మేలు చేసే ఒక రహస్యం నా వల్ల పాడైంది. మళ్ళీ ఆయన చెప్పడం సాగించాడు.

"ఇప్పుడు మనకున్న అశాంతి, జాతి నాశనమయ్యేందుకు కావలసిన మారణాయుధాలు అవీ అంగారక గ్రహంలో ఉండేవి. భూమికున్న వాతావరణ రక్షకకవచం ఆ గ్రహానికి ఉండేది పల్చగా. అహంకారంతో మతి భ్రమించిన ఆ గ్రహవాసులు తమ అవివేకంతో ఆ గ్రహాన్ని నాశనం చేశారు. ఇప్పుడు మనకున్న విజ్ఞానానికి ఎన్నో వందలరెట్లు అభివృద్ధి చెందిన అంగారక గ్రహం పగలు అగ్నిగోళం లాగా, రాత్రి మంచుముద్దలాగా అవడానికి కారణం అప్పటి ఆ గ్రహపాలకుల అవివేకం. ఒక దురదృష్ట సమయంలో యుద్ధం చెలరేగింది. అణువిస్ఫోటం అంగారక గ్రహాన్ని కుదిపింది. జాతి మొత్తం సర్వనాశనమైంది.

కొందరు అంగారక గ్రహవాసులు ముందే ఈ పరిస్థితిని ఊహించారు. ఆ సమయంలో భూమి ఒక నీటిగుంటలా ఉండేది. సముద్రాలు, కొండలు, బురదనీటి కయ్యలు, విచ్చలవిడిగా పెరిగిన జీవరాసులు. 'పరిస్థితి విషమించినప్పుడు ఎక్కడికి వెళ్ళాలి' అన్న ప్రశ్నకు 'భూమి' అన్న జవాబు దొరికింది వాళ్ళ మేధావులకు.

దానికి రెండు కారణాలున్నాయి. భూమికి మందమైన వాతావరణ కవచం ఉంది. అమితమైన సూర్యకాంతి నుంచి ఈ కవచం భూమిని రక్షిస్తోంది. రెండోది—భూమికి అంగారకునికి మధ్య దూరం—అప్పుడు మూడుకోట్ల సలభై లక్షల మైళ్ళే—అతి దగ్గరగా అంగారకుడు పయనిస్తున్నాడు-భూమికి. అబ్బ! ఇంతదూరమా అని మనకనిపించవచ్చు. ఈగ ఒక పెంటకుప్ప మిద నుండి ఇంకో పెంటకుప్ప మీదికి ఎగిరివెడుతుంది. ఇప్పుడున్న మన్న రాకెట్లు, స్పుట్నిక్‌లు ఆ ఈగ వేగంతో సమానం. ఆ ఒరవడిలో వాళ్ళ రాకెట్లు, స్పుట్నిక్ (అంగారక గ్రహంలోవి) ఎంత వేగం కలిగి ఉండాలి?

"అణు యుద్ధం మొదలుకాగానే కొంతమంది తమ విమానాల్లో భూమికి బయలుదేరారు. ఆ విమానాలు ఎటువంటివి? మూడుకోట్ల సలభై లక్షల మైళ్ళ దూరం కేవలం కొద్దిగంటలలో ఎలా ప్రయాణించాయి? అన్న విషయం ఆ జీవులు నాకు తెలుపవలసి ఉంది...వాటికి ఆ వివరాలకు సంబంధించిన పత్రాలో. ఇంకేవో ఎక్కడున్నాయో తెలుసు."

ఆయన చెప్పడం ఆపుచేశాడు. దీర్ఘంగా నిట్టూర్చి నాకేసి చూశాడు. తప్పు చేసిన వాడిలా తల వంచుకున్నాను. అతివేగంగా ప్రయాణించే మన ఛాలెంజర్లు, వాయేజర్లు ఈగ ప్రయాణవేగంతో పోలిస్తే, అంగారక గ్రహవాసుల విమానాలు, ఎలా ఉండేవి? మానవజాతి ఈ రహస్యం తెలుసుకునే సమయానికి అనర్థం జరిగిపోయింది!

"అంగారక గ్రహం భూమికి దూరంగా జరిగినప్పుడు ఇరవైనాలుగు కోట్ల, డబ్బై లక్షల మైళ్ళు దూరం జరుగుతుంది. ఈ దూరం కూడా అంగారక వాసులకు దుస్సాధ్యమేమీ కాదు...అయితే వింతైన విషయం ఏమిటంటే ఈ స్ఫటికపు మనుమకు వాటి గురించి ఏమీ తెలియదు—నా రెండు నెలల పరిచయంలో నాకర్థమయినదేమంటే—

"చీకట్లు ముసురుకుంటున్న వేళ అతివేగంగా నాలుగు అంగారక నౌకలు భూమిమీద దిగాయి. అప్పటికే నేలమీద జీవరాశి ఉంది. వైజ్ఞానికంగా బాగా వెనుకబడి ఉన్న జాతి ఆ మానవజాతి.

"అంగారక గ్రహవాసులలో పిల్లలు పెద్దలు ఉన్నారు. తాము తీసుకువచ్చిన నౌకలు ఒకచోట భద్రంగా దాచి భూలోకం చూడడానికి బయలుదేరారు అంగారకులు. భూమి వాతావరణం వాటికి పడలేదు. కొన్ని రోజులలో చాలామటుకు నశించారు. కొంతమంది భూమి వాతావరణానికి అలవాటు పడ్డారు. వారి సంతతి క్రమంగా పెరిగింది.

"స్వతస్సిద్ధంగా తెల్వైన అంగారకులు కొద్ది పాటి భూవాసులను మట్టుపెట్టాయి. ఆ ధాటికి తట్టుకోలేక భూలోకవాసులు నాశనమయ్యారు. మిగిలిన మనుమలు నేలపొరల్లో దాక్కున్నారు."

నాకు కుతూహలం అధికమైంది.

"ఏమిటీ మీరంటున్నది? స్ఫటికపు మనుములు..."

"అవును...వాళ్ళే అసలు భూలోకవాసులు."

"మరి మనం ఈరోజు పిలిచే మనుములు?"

"నిజానికి భూమి మీదున్న నాలుగు వందల కోట్ల మనుమలు అంగారకుని వారసులు. కోట్ల సంవత్సరాలుగా నశించినదనుకుంటున్న మానవులు ఆ స్ఫటికపు మనుమలు—మన పూర్వీకుల విజ్ఞానం మనం పోగొట్టుకున్నాం. రోజులు గడిచేకొద్దీ మొదటి నుంచి అన్నీ నేర్చుకున్నాం. వాళ్ళ విజ్ఞానం మనకు లేదు. ఈరోజు కొన్ని గంటలలో కాదు—కొన్ని నెలల్లో కూడా మనం మన పూర్వపు గ్రహమైన అంగారకగ్రహం చేరుకోలేము. ఈనాడు అంగారక గ్రహంలో వచ్చిన పరిస్థితే వచ్చింది—భూమికి కూడా! ఎప్పుడో భూమి భగ్గుమంటుంది. మిగిలిన అంగారక జాతి—తమ వలసరాజ్యమైన భూమి మీద నశిస్తుంది. ఈ మానవజాతి ఎక్కడికి వెళ్ళాలి? ఏది దారి?"

బావ చెప్పడం ఆపు చేశాడు. ఆయన చెప్పిన విషయాలు నాకు తలకెక్కలేదు.

మనం మరో గ్రహం నుంచి వచ్చిన వాళ్ళమా? భూమి మీదుండే మానవులను నిర్మూలించి ఈ గ్రహాన్ని సొంతం చేసుకున్నామా? ఏమో? కోతి నుంచి వచ్చిన మనం కోతిని మన పూర్వీకులుగా గౌరవించగలమా? కాంతివేగం కన్నా వేగంగా వెళ్ళే గ్రహాంతర నౌకల రహస్యం నా మూలాన మరుగునే ఉండిపోయింది.

ఈనాటి, భూలోకవాసులు ఒకప్పటి అంగారక గ్రహవాసులన్న విషయం రుజువు కాకుండా నిలిచిపోయింది. అసలు సిసలైన భూలోకవాసులు-ఆ స్ఫటికపు మనుమలా? ఎక్కడో భూమి పొరల్లో దాగి మనిషిని చూసి పారిపోయిన వాళ్ళు తిరిగి కనిపించరు. ఒక సువర్ణావకాశం చేజారిపోయింది. ●